
సాక్షి
ఒడిశా

బుధవారం। 19। జూన్। 2024



శ్రీమందిరం ఆదాయం

నగదు-రూ.4,78,879
బంగారం-1 గ్రాము 640 మిల్లీ గ్రాములు
వెండి-16 గ్రాముల 650 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



రైతు సంక్షేమమే ధ్యేయం

రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని వక్తలు పేర్కొన్నారు.

-8లో▸



కొలువుదీరిన ఘటాలు

రాయగడ గ్రామదేవత బురదల పోలమ్మ అమ్మవారి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం తొమ్మిది ఘటాలు కొలువు దీరాయి.

-8లో▸

న్యూస్‌రీల్

భానుడి భగభగలు



ఎండలో గొడుగు తప్పనిసరి

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో మంగళవారం ఉక్కపోతతో ప్రజలు విలవిల్లాడారు. పగటి పూట ఉష్ణోగ్రతలు 35 నుంచి 40 డిగ్రీలు నమోదయ్యాయి. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధిక ఉష్ణోగ్రతల ధాటికి జిల్లాలో పాఠశాలలు, కళాశాలలు మూసివేశారు.

విపత్తులపై అప్రమత్తం



సమావేశంలో చర్చిస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: విపత్తుల సమయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్ సమావేశం నిర్వహించారు. రానున్న వర్షాల సీజన్‌లో వరదలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అన్ని బృందాలు అలర్ట్‌గా ఉండాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల ఆందోళన



ఆస్పత్రి అధికారికి మెమొరాండం అందిస్తున్న ఆశా వర్కర్ల సంఘ ప్రతినిధులు

జయపురం: వేతన బకాయిలు చెల్లించకపోతే విధుల బహిష్కరణ తప్పదని జయపురం సబ్ డివిజన్ కుంద్రా సమితిలోని ఆశావర్కర్లు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం కుంద్రా కమ్యూనిటీ ఆస్పత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారంలోగా తమకు న్యాయం చేయాలన్నారు. 152 మంది ఆశా వర్కర్లు గర్భిణుల సేవలో రాత్రింబవళ్లు పనిచేస్తున్నా తమ హక్కులు, ప్రయోజనాలు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బొడా కాజల్ తరాసియ, బీపీఓ అంబుజిని బారిక్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.


జయపురం ఎమ్మెల్యేకు సత్కారం



బాహిణీపతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జర్నలిస్టులు

జయపురం: జయపురం ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయాలు సాధించిన తారాప్రసాద్ బాహిణీపతిని సోమవారం ఒడిశా జర్నలిస్టు యూనియన్ (ఉత్కళ సంబాదిక సంఘం) కొరాపుట్ జిల్లా శాఖ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని వారంతా ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలను చైతన్యపరిచిన జర్నలిస్టులను అభినందించారు. కార్యక్రమంలో ఓజేయు జిల్లా అధక్షుడు కె.శ్రీనివాసరావు, వి.భాస్కరరావు, మనోజ్‌దాస్, దేవీ ప్రసాద్ మహంతి, మధుసూదన పాత్రో, కిశోర్ సాహు, నవరంగపూర్ జిల్లా ఓజేయూ అధ్యక్షుడు హృషికేష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

నకిలీ సీబీఐ అధికారి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

జయపురం: సీబీఐ అధికారిగా చలమణి అవుతూ ప్రజలను మోసగిస్తున్న వ్యక్తిని జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి నాటు తుపాకీ స్వాధీనపరచుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి బొయిపరిగుడ పోలీసు అధికారి మంగళవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. కుంద్రా సమితి ఘుమర పంచాయతీ గంటియగుడ గ్రామానికి చెందిన భొగేశ్వర ఘంటియ ఈ నెల 11న ధటుగుడ గ్రామంలో లక్ష్మీ హరిజన్ అనే మహిళకు నాటు తుపాకీ గురి పెట్టి తాను సీబీఐ అధికారినంటూ డబ్బు దోచుకోవాలని ప్రయత్నించాడు. ఈ ఘటనపై లక్ష్మీ హరిజన్ బొయిపరిగుడ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి ఆచూకీ తెలుసుకుని గంటియగుడ వెళ్లి అరెస్టు చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి జయపురం కోర్టులో హాజరుపరిచారు.

భగ్గుమన్న బాలాసోర్

- ఇరువర్గాల మధ్య ఘర్షణ
- పరస్పరం ఇళ్లల్లో దాడులు
- కర్ఫ్యూ విధించిన పోలీసులు
- ప్రవేశ మార్గాలు మూసివేత
- ఐదు ప్లాటూన్ల బలగాల మోహరింపు
- 48 గంటల పాటు ఇంటర్నెట్ సేవలు బంద్



రాళ్లు రువ్వుతున్న ఆందోళనకారులు



భారీగా మోహరించిన పోలీసులు

భువనేశ్వర్: బాలేశ్వర్ నగరంలోని సుస్‌హట్ ప్రాంతంలో సోమవారం రెండు వర్గాల మధ్య ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఇరువర్గాలు రాళ్లు, కర్రలు, గాజు సీసాలు రువ్వుకోవడంతో ఐదుగురు పోలీసులతో సహా 10 మంది గాయపడ్డారు. ప్రజల ఇళ్లలోని ఫర్నిచర్‌తో పాటు పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. నగరంలోని గోలా పాఖోరి, మోతీగంజ్, సినిమా ఛక్ ప్రాంతాలకు అర్ధరాత్రి సరికి ఘర్షణ వ్యాపించింది. దుండగులు వీధుల్లోకి చొరబడి ప్రజల ఇళ్లపై రాళ్లతో దాడి చేసి నిప్పుపెట్టి విధ్వంసకర పరిస్థితులు సృష్టించారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈస్టర్న్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ డాక్టర్ దీపక్ కుమార్, పోలీసు సూపరింటెండెంట్ సాగరిక నాథ్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు కర్ఫ్యూ విధించారు. నగరంలోకి ప్రవేశించే అన్ని ప్రవేశ మార్గాలను మూసివేశారు. అన్ని చోట్లా సాయుధ బలగాలను మోహరించారు. ఎంపీ ప్రతాప చంద్ర షడంగి, సదరు ఎమ్మెల్యే మానస్ కుమార్ దత్తా పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మంగళవారం బాలేశ్వర్ నగరంలోని అన్ని దుకాణాలను మూసివేయాలని జిల్లా యంత్రాంగం, పోలీసులు ఆదేశించారు.

వాగ్వాదంతో మొదలై..

స్థానిక సమాచారం ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం సుస్ హట్ ప్రధాన రహదారి పక్కన ఉన్న కాలువలో రక్తం ప్రవహించడం చూసి కొందరు భయాందోళన వ్యక్తం చేశారు. ఈ రక్తం ఎక్కడి నుంచి ప్రవహిస్తుందో ఆరా తీసే ప్రయత్నంలో తీవ్ర అలజడి చోటు చేసుకుంది. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ విషయమై ఫిర్యాదుదారుడి నుంచి సమాచారం అందుకున్న పోలీసులు, మీడియా ప్రతినిధులు అక్కడికి చేరుకున్నారు. ఈ సమయంలో వందలాది మంది ప్రత్యర్థి వర్గాల వ్యక్తులు గుమిగూడి ఫిర్యాదుదారుడిపై దాడి చేసి రాళ్లు, గాజు సీసాలు రువ్వారు. ఇరువర్గాలు నడి రోడ్డుపైనే పరస్పరం దాడులు చేసుకోవడం, ప్రతీకారం తీర్చుకోవడంతో ఘటనా స్థలంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వీరిని అదుపు చేసేందుకు వెళ్లిన అదనపు పోలీసు సూపరింటెండెంట్ అనిల్ ప్రధాన్, ఎస్‌డీపీఓ డాక్టర్ శశాంక్ శేఖర్ బెవురా, డీఎస్పీ బ్రజ్‌మోహన్ ప్రధాన్‌తో పాటు ఇద్దరు పట్టణ పోలీసు అధికారులు, 3 మంది కానిస్టేబుళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. రాళ్లు, గాజు సీసాలు రువ్వడంతో ఆ మార్గం గుండా వెళ్తున్న 10 మందికి పైగా ప్రజలు, రోడ్డుపై వెళ్తున్న సామాన్యులు కూడా గాయపడ్డారు. ఆ సమయంలో బైక్‌లు, స్కూటర్లు, నాలుగు చక్రాల వాహనాలను ఆపి వ్యక్తులపై దాడి చేసి వాహనాలు పగులగొట్టి చితకబాదారు. వార్తలు సేకరించేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులను సైతం వదిలి పెట్టలేదు. రాళ్ల దాడిలో పలువురు పాత్రికేయులు కూడా గాయపడ్డారు. కెమెరా పగులగొట్టారు. దాదాపు 2 గంటలపాటు ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరగడంతో పోలీసు సూపరింటెండెంట్ సాగరిక నాథ్ ఆధ్వర్యంలో సాయుధ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఘటనా ప్రాంతంలో 5 ప్లాటూన్ బలగాలను మోహరించగా, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 144 సెక్షన్ విధించారు. ఆ తర్వాత పరిస్థితి అదుపు తప్పడంతో కర్ఫ్యూ విధించారు. శాంతి నెలకొనే వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయి. ప్రజలందరూ ఇళ్లలోనే ఉండాలని అభ్యర్థించారు. ఘటనపై సమగ్ర విచారణ జరుపుతామన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

ఇంటర్నెట్ సేవలు బంద్..

బాలాసోర్ మునిసిపల్ ప్రాంతంలో గ్రూపు ఘర్షణల నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాలాసోర్ జిల్లా అడ్మిన్ కర్ఫ్యూ విధించారు. కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు కూడా నిలిపివేశారు. ప్రస్తుతం నిరవధికంగా కర్ఫ్యూ కొనసాగుతోంది. బాలాసోర్ పట్టణంలోని నివాసితులు తమ ఇళ్లలోనే ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు రావద్దని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. అదనపు డైరెక్టర్ జనరల్ (శాంతి భద్రతలు) సంజయ్ కుమార్ ప్రస్తుతం బాలాసోర్ పట్టణంలోనే ఉంటూ సమీక్షిస్తున్నారు. పోలీసులు ఫ్లాగ్మార్చ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 30 మందికి పైగా అరెస్టు చేశారు. బాలాసోర్‌లో జూన్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్(ట్విట్టర్) వంటి సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌లు, మొబైల్, ఇంటర్నెట్, డేటా సేవలు నిలిపివేశారు.

కొత్త శాసన సభ్యుల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మోహన్‌చరణ్ మాఝీ



మహాత్మునికి నివాళులు అర్పిస్తున్న సీఎం, డిప్యూటీ సీఎంలు

భువనేశ్వర్ : రాష్ట్ర శాసనసభ తొలి సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. రెండు రోజుల పాటు ప్రమాణ స్వీకారం కార్యక్రమం కొనసాగనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ మొదటగా ప్రమాణ స్వీకారం చేయగా, ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా ఆ తర్వాత ప్రమాణ స్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ రణేంద్ర ప్రతాప్ స్వంయి కొత్త సభ్యులతో ప్రమాణం చేయించారు.

స్పీకర్ ఎన్నిక రేపు..

ఈ నెల 20న స్పీకర్ ఎన్నిక జరగనుండగా బుధవారం వరకు ఎమ్మెల్యేల ప్రమాణస్వీకార కార్యక్రమం కొనసాగనుంది. ప్రమాణస్వీకారానికి ముందు శాసన సభ ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సీఎం, ఉప ముఖ్యమంత్రులతో పాటు ఎమ్మెల్యేలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బిజూ జనతా దళ్ అధ్యక్షుడు, గంజాం జిల్లా హింజిలి నియోజకవర్గ ఎమ్మెల్యే నవీన్ పట్నాయక్ కూడా పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ప్రమాణం చేశారు. అంతకుముందు తొలి సమావేశాలు పురస్కరించుకుని శాసన సభ స్పీకర్ రణేంద్ర ప్రతాప్ స్వంయి గార్డ్ ఆఫ్ హానర్ అందుకున్నారు. బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌ను ప్రతిపక్ష నాయకుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు బిజూ జనతా దళ్ తన మొదటి శాసన సభా పక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించనుంది. బీజేడీ సీనియర్ నేతల్లో ఒకరు ఉప నేతగా ఉండే అవకాశం ఉంది.

సైకిల్‌పై వచ్చిన ఎమ్మెల్యే..

భారతీయ జనతా పార్టీకి చెందిన దిగొపాహొండి నియోజకవర్గ ఎమ్మెల్యే సిద్దాంత్ మహాపాత్రో ప్రమాణ స్వీకారం చేసేందుకు సైకిల్‌పై రాష్ట్ర శాసన సభకు చేరుకుని అందరి దృష్టిని ఆకట్టుకున్నారు. బీజేడీ పూరీ ఎమ్మెల్యే సునీల్ మహంతి మీడియాతో మాట్లాడుతూ సామాన్య ప్రజల ఆశీర్వాదం వల్లే తాను ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయడం సాధ్యమైందని చెప్పారు. బిజూ జనతా దళ్ సుదీర్ఘ కాలం ప్రజలకు సేవ చేసిందని, రాజకీయాల్లో ప్రతిపక్షం ఎప్పుడూ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. 1995లో తన తండ్రి దివంగత మంత్రి మహేశ్వర్ మహంతి తొలిసారి ఎమ్మెల్యే అయినప్పుడు ప్రతిపక్షంలో ఉన్నారని, అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఏం చేయలేకపోయినా ఆయన ఎన్నో చేశారని గుర్తు చేసుకున్నారు. నియోజకవర్గ ప్రజల కోసం సభలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని చెప్పారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ప్రొటెం స్పీకర్ రణేంద్రప్రతాప్ స్వంయి

21న యోగా డే వేడుకలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం యోగా డే సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ ఆదేశాల మేరకు ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. పర్లాకిమిడిలోని గజపతి స్టేడియం, చంద్రగిరిలో టిబెటియన్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ గ్రౌండ్స్‌లో యోగాసనాలు వేయించాలని ఉపాధ్యాయులను, పీఈటీలను ఆదేశించారు. జిల్లాలో 161 పాఠశాలలు, 800 వందల మందికి పైగా విద్యార్థులు, టీచర్లు ఈ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 22, 23 తేదీల్లో సీనియర్, జూనియర్స్ విభాగాలలో రచనలు, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా శిశు సురక్షా సమితి అధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి, స్పోర్ట్స్ అధికారి ప్రాణకృష్ణ పాణిగ్రాహి, సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ సునీతా పాణిగ్రాహి, పతంజలి యోగా సమతి అధ్యక్షుడు బిఘ్నేశ్వర్ దాస్, సరస్వతీ శిశు మందిర్ ప్రధాన ఆచార్యులు సరోజ్ పండా తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టిన ఆటో



నుజ్జయిన ఆటో

మల్కన్‌గిరి : జిల్లాలోని కోరుకొండ సమితి తర్లకోట గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. మల్కన్‌గిరి నుంచి కోరుకొండ సమితిలోని సంతకు బయలుదేరిన ఆటో పని పూర్తయిన అనంతరం బలిమెలకు తిరుగుప్రయాణమైంది. తర్లకోట వద్ద ఆటో బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను కోరుకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఒకరి పరిస్థితి విషమించడంతో మంగళవారం మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

అదుపులోకి అంతుచిక్కని వ్యాధి!

- మునిషిపొదొరొ గ్రామంలో వ్యాధి తీవ్రత తగ్గుముఖం
- డిఫ్తీరియాగా గుర్తించి చికిత్స అందిస్తున్న వైద్యులు
- కొరాపుట్ జిల్లా కుంభారిపుట్‌లో పలువురికి వ్యాధి లక్షణాలు
- అప్రమత్తమైన యంత్రాంగం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జియోన మెలక



జ్వరంతో బాధపడుతున్న మధుర దొలాయి



జ్వరంతో బాధపడుతున్న మనోజ్ గడిబిసి

రాయగడ: సమగ్ర నివారణ చర్యలు చేపట్టడంతో మునిషిపొదొరొ గ్రామంలో అంతుచిక్కని వ్యాధి అదుపు దశగా ఉందని జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రైత్రాయ్ చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణ వంటి పరీక్షలు ఇంకా కొనసాగుతున్నాయని, ఇకపై వ్యాధి సంక్రమించకుండా అందుకు అవసరయ్యే టీకాలను చిన్నారులకు వేస్తున్నామని చెప్పారు. కొద్ది రోజులుగా అంతుచిక్కని వ్యాధితో కాసీపూర్ సమితి డొంగాశిలి పంచాయతీలోని మునిషిపొదొరొలో ఐదుగురు చిన్నారులు మృతి చెందిన సంగతి తెలిసిందే. వ్యాధి బారిన పడి వివిధ ఆస్పత్రుల్లో ఇప్పటికే 15 మందికి పైగా చిన్నారులు చికిత్స పొందుతుండగా, మరికొందరు కొరాపుట్ ఎంకేసీజీ ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్నారు. వ్యాధి సోకడానికి గల కారణాలపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి జిల్లా ఆరోగ్య శాఖకు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే . ఈక్రమంలో జిల్లా వైద్య బృందం నిరంతరం చర్యలు చేపట్టింది. ప్రత్యేక వైద్య బృందం శిబిరం ఏర్పాటు చేసి వ్యాధి లక్షణాలు, బాధితులను గుర్తించి ప్రక్రియ ప్రారంభించింది. రక్తనమూనాలను సేకరించి జిల్లా వైద్య కేంద్రానికి తరలించింది. దీనిని డిఫ్తీరియా భావించిన వైద్యులు అందుకు అనుగుణంగా చికిత్స ప్రారంభించారు. ఈ వ్యాధిలో ఇప్పటికే అయిదుగురు మృతి చెందగా జిల్లా కేంద్రంలో చికిత్స పొందుతున్న మహేంద్ర మాఝి , జయరాం మాఝి, పవిత్ర మాఝిలు కొలుకుంటున్నారు. కొరాపుట్ ఎంకేసీజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బిజయ్ మాఝి, మోహన్ మాఝిలు కోలుకునేందుకు మరికొద్ది రోజులు పడుతుందని వైద్యులు తెలిపారు.

పొరుగు జిల్లాలో వ్యాధి లక్షణాలు..

పొరుగు జిల్లా కొరాపుట్‌లోని బంధుగాం సమితి కుంభారిపుట్‌లోనూ డిఫ్తీరియా వ్యాధి బారిన పడి జియోన మెలక పదేళ్ల చిన్నారి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం సోమవారం బరంపురం తరలించారని బాధితురాలి తండ్రి సుబ్బారావు మెలక తెలిపారు. తమ గ్రామంలో మరికొందరు ఇటువంటి తరహా వ్యాధి బారిన పడి ఉన్నారని చెప్పారు. అయినా కొరాపుట్ వైద్యశాఖ ఇప్పటికీ స్పందించలేదని, తన కుమార్తె పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో చికిత్స కోసం రాయగడ తీసుకువచ్చినట్లు చెప్పారు.

కళ్యాణసింగుపూర్‌లో జ్వరాలు..

జిల్లాలోని కళ్యాణసింగుపూర్‌లో వివిధ పంచాయతీల్లో జ్వరాలతో ప్రజలు సతమతమవుతున్నారు. సునీత దొలాయి, మనోజ్ గడిబిసి, జున్ని దొలాయి, సునిత దొలాయి, మధుర దొలాయిలు జ్వరాలతో బాధపడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే కొందరు వివిధ ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందుతుండగా మరికొందరు ఇంటికే పరిమితమయ్యారు. వీరికి మలేరియా వ్యాధి సోకినట్లుగా తెలుస్తోంది. అయితే వైద్య శాఖ ఇంతవరకు స్పందించలేదు.

రాయగడ కలెక్టర్‌కు ప్రత్యేక ఆదేశాలు

భువనేశ్వర్: రాయగడ జిల్లా కాశీపూర్ మండలం మునిసిపాదొరోలో డిఫ్తీరియా వ్యాప్తి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, ప్రముఖ కార్యదర్శి షాలిని పండిట్ మంగళవారం రాయగడ జిల్లా కలెక్టర్ను ఆదేశించారు. గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో గొంతు నొప్పితో కూడిన జ్వర పీడితులను ముందస్తుగా గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. ఇందుకు ఆరోగ్య సంరక్షణ కార్మికులు, సూపర్‌వైజర్లు సేవలు వినియోగించుకోవాలని ఆదేశించారు. మునిసిపాదురో గ్రామం నుంచి రాకపోకలు వీలైనంత కట్టడి చేయాలన్నారు. పిల్లలకు టీకాలు వేయడానికి సమగ్ర శిబిరాలు నిర్వహించాలన్నారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టడానికి మండల, జిల్లా స్థాయిల్లో అంతర్ విభాగాల కన్వర్జెన్స్ సమావేశాలను ప్రతిరోజూ కొనసాగించాలన్నారు. రోజువారీ నిఘా నివేదికలు, టీకా కవరేజ్ నివేదికలను రాష్ట్ర నిఘా యూనిట్, కుటుంబ సంక్షేమ డైరెక్టరేట్‌కు సమర్పించాలని ఆదేశించారు.

క్లుప్తంగా

వలలు దగ్ధం


కాలిపోతున్న చేపల వలలు

సంతబొమ్మాళి: భావనపాడు తీరంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు రెండు చేపల రింగ్ వలలను దహనం చేశారు. విషయం తెలుసుకున్న మత్స్యకారులు సంఘటనా స్థలాన్ని చేరుకొని మంటలను అదుపు చేయాలని ప్రయత్నించినా అప్పటికే వలలు అగ్నికి దగ్ధమయ్యాయి. సుమారు రూ. 15లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత మత్స్యకారులు గొరకల ఆదినారాయణ తెలిపారు. దీనిపై నౌపడ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


హిరమండలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

హిరమండలం: అవలంగి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సమీప తోటల్లో మృతదేహం కనిపించడంతో స్థానికులు హిరమండలం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి పరిశీలించారు. మృతుడి వయస్సు 50–70 ఏళ్లు ఉంటుంది. పంచెకట్టుతో ఉన్న మృతుడు ఈ ప్రాంతం వాడేనని అనుమానిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు హిరమండలం పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ జి.నారాయణస్వామి సూచించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

దొంగిలించిన బంగారం, డాలర్లు స్వాధీనం

సోంపేట: మండలంలోని బారువ గ్రామానికి చెందిన సీపాన రోహిణమ్మ ఈ నెల 17వ తేదీన సోమవారం ఉదయం బారువ నుంచి సోంపేట వస్తుండగా 5 తులాల బంగారం, 1240 ఆస్ట్రేలియా డాలర్లతో ఉన్న బ్యాగును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. సోమవారం రాత్రి సోంపేట పోలీసులకు రోహిణమ్మ ఆటో నంబర్‌తో సహా ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆటోలో ప్రయాణించిన వారిని గుర్తు పట్టి వారి నుంచి బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన వారిని గజపతినగరానికి చెందిన వారుగా గుర్తించినట్లు ఎస్‌ఐ బి.హైమావతి తెలిపారు. వీధుల్లో చిన్న చిన్న వస్తువులు అమ్ముకుంటూ వ్యాపారం చేస్తుంటారని పేర్కొన్నారు.

రెండు ఇసుక లారీల పట్టివేత


గార స్టేషన్ వద్ద ఇసుక లారీలు

గార: మండలంలోని బూరవెల్లిలో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక లారీలను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం వేకువజామున ఒక లారీని సెబ్ పోలీసులు, మరో లారీని గార పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కె. కృష్ణప్రసాద్ తెలిపారు.

20 నుంచి ప్రథమ చికిత్సపై శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22 వరకు రెడ్‌క్రాస్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో ప్రథమ చికిత్సపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ పి.జగన్మోహనరావు ఓ ప్రకటనలో తెలిపారు. పరిశ్రమల్లో, కంపెనీల్లో, దుకాణాల్లో పనిచేస్తున్న కార్మికులు, విద్యాసంస్థల్లో ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. శిక్షణకు వచ్చే ప్రతి వ్యక్తి ఆంధ్రప్రదేశ్ రెడ్‌క్రాస్ యాప్ ద్వారా వలంటీర్‌గా నమోదు చేసుకోవాలని కోరారు. శిక్షణలో పాల్గొనే ప్రతి వ్యక్తి రూ.1500లు ఢిల్లీ రెడ్‌క్రాస్ నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించాలని, వారు సర్టిఫికేషన్ చేస్తారని తెలిపారు.

షాపుల వెనుక అగ్ని ప్రమాదం


షాపుల వెనుక భాగంలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నరసన్నపేట: స్థానిక కాలేజీ రోడ్డులో రాజుల చెరువు వైపు ఉన్న షాపుల వెనుక భాగంలో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. మెకానిక్ రమణ షాపు నుంచి ఎస్‌ఆర్‌కే టైలర్ షాపుల వరకూ వెనుక భాగంలో మంటలు వ్యాపించాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షాపుల వెనుక వేసిన వ్యర్థాల వద్ద ఈ మంటలు అంటుకున్నాయి. షాపులు కూడా కాలిపోతాయేమోనని అంతా భయపడ్డారు. అయితే అగ్ని మాపక సిబ్బంది స్పందించడంతో ఎలాంటి నష్టం జరగలేదు.

రైతు సంక్షేమమే ధ్యేయం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రైతులు, కలెక్టర్, ఇతర అధికారులు


రైతులను సత్కరిస్తున్న కలెక్టర్

పర్లాకిమిడి: రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని వక్తలు పేర్కొన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద 9 కోట్ల 26 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.20వేల కోట్లను ప్రధాని నరేంద్ర మోదీ డీబీటీ విధానంలో మంగళవారం జమ చేశారు. జిల్లాలోని ఆర్.సీతాపురంలో సెంచూరియన్ వర్సిటీ వేదికగా వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి గుణనిధి నాయక్, ఏడీఎం రాజేంద్ర మింజ్, సబ్ కలెక్టర్ అనూప్ పండా, జిల్లా ముఖ్య పశుచికిత్సాధికారి ధర్మానంద మహంతి, జిల్లా ఫిషరీ శాఖ అధికారి బలరాం సుబుద్ధి, ఏఆర్‌సీఎస్ హరిహర శెతి, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సకాలంలో వర్షాలు కురవడం లేదన్నారు. అందుకే 110 రోజుల్లో పంట కోతకు వచ్చే వరి వంగడాలు వేయాలని సూచించారు. అనంతరం ఐదుగురు ఆదర్శ రైతులను సన్మానించారు. సత్కారం అందుకున్న వారిలో గుమ్మా రైతు ఇజ్రాయిల్ గొమాంగో, కాశీనగర్‌కు చెందిన బిడ్డికి కృష్ణ తదితరులు ఉన్నారు.


కార్యక్రమానికి హాజరైన అధికారులు, రైతులు

కొలువుదీరిన ఘటాలు


అమ్మవారి ఘటాలు

రాయగడ : రాయగడ గ్రామదేవత బురదల పోలమ్మ అమ్మవారి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక మెయిన్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన షెడ్డులో మంగళవారం అమ్మవారి ప్రతిరూపాలైన తొమ్మిది ఘటాలు కొలువు దీరాయి. అత్తవారింటి నుంచి కన్నవారి ఇంటికి వచ్చిన అమ్మవారు ఇక్కడ విశ్రాంతి తీసుకుంటారు. ఈ నేపథ్యంలో ఘటాలను ఘనంగా ఊరేగిస్తారు. దీనినే నగర పరిక్రమణగా పిలుస్తారు. అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ప్రముఖ వేద పండితులు శ్రీరాం శర్మ నేతృత్వంలో సోమవారం మధ్యాహ్నం లలితా సహస్ర నామ పారాయణం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని 75 వేల సార్లు లలిత సహస్రనామాన్ని పారాయణం చేశారు.


లలితా పారాయణం చేస్తున్న మహిళలు

ఆర్ట్ ఆఫ్ గివింగ్ సేవలు భేష్



వేదికపై అమూల్య సాహు, సబ్ కలెక్టర్ కల్యాణి, విద్యావేత్త డి.కె.మహంతి తదితరులు

రాయగడ: ఆర్ట్ ఆఫ్ గివింగ్ సంస్థ సేవలు అభినందనీయమని రాయగడ సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్రా దేవి అన్నారు. స్థానిక హోటల్ తేజస్విలో సోమవారం సాయంత్రం ఆర్ట్ ఆఫ్ గివింగ్ డే సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ, పేద విద్యార్థులకు ఆశాదీపంగా మారిన డాక్టర్ అచ్యుత్ సావుంత ఏర్పాటు చేసిన ఆర్ట్ ఆఫ్ గివింగ్ కార్యక్రమం నేడు అన్ని ప్రాంతాల్లోనూ విస్తరించిందన్నారు. ఎంతో మంది పేదలకు బాసటగా నిలుస్తుండటం అభినందనీయమన్నారు. విద్యావేత్త డాక్టర్ డి.కె.మహంతి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలన్నారు. నిరుపేదలకు తమ వంతు సహకారాన్ని అందించాలని కోరారు. ఆర్ట్ ఆఫ్ గివింగ్ జిల్లా సమన్వయకర్త అమూల్య రత్న సాము మాట్లాడుతూ ఆర్ట్ ఆఫ్ గివింగ్ దినోత్సవాన్ని ఏటా జూన్ 17న నిర్వహిస్తున్నామని చెప్పారు. అంతకుముందు పట్టణంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేశారు. అనాథ పిల్లలకు బిస్కెట్లు, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మహిళా సంఘాల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.


చిన్నారులతో ఆర్ట్ ఆఫ్ గివింగ్ సమన్వయకర్త, సభ్యులు

మహిళా పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

జయపురం: జయపురం ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం 52 మంది మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీతలు మాట్లాడుతూ జయపురం వీధులు, రోడ్లు, మార్కెట్లు, మురికివాడలు ఊడ్చుతూ పారిశుద్ధ్య పరిరక్షణకు పాటుపడుతున్న కార్మికులను గుర్తించి సత్కరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జస్‌పాల్ సింగ్, సింహాచల బిశాయి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ప్రతినిధి మధుస్మిత మిశ్ర, నిశంక పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.


మహిళా కార్మికులతో మున్సిపల్ చైర్మన్

విపత్తులను సమర్థంగా ఎదుర్కొందాం

పర్లాకిమిడి: ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కొందామని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి పర్యవేక్షణ బృందం అధికారులతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలు, తుపాను, భూకంపం వంటివి సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తినష్టం కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో అగ్నిమాపక దళం, ఓడ్రాఫ్ బృందం ఆధ్వర్యంలో ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైపరీత్యాల పర్యవేక్షక విభాగం అధికారి మేఘానంద బెహరా, జిల్లా గ్రామీణాభివృద్ధి కార్య నిర్వహణ అధికారి గుణనిధి నాయక్, ఐటీడీఏ అధికారి దిలీప్‌కుమార్ బెహరా, డీఎస్పీ అలోక్ రంజన్ రాయ్, జిల్లా అత్యవసర అధికారి జగన్నాథ పాఢి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్

ముమ్మరంగా జీడి పిక్కల కొనుగోలు

పలాస: పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని ఉద్దానం ప్రాంత గ్రామాల్లో జీడిపిక్కల కొనుగోలు ముమ్మరంగా జరుగుతోంది. ఇటీవల జీడి రైతాంగ పోరాట కమిటీలు ఇచ్చిన పిలుపు మేరకు గ్రామాల్లో గ్రామ కమిటీలు ఆధ్వర్యంలో జీడి పిక్కల ధరలను ఆయా గ్రామాల్లోనే తేల్చారు. గ్రామాల్లో కనీసం 80 కిలోల జీడి పిక్కల బస్తాకు రూ.11వేలు అయితే సరిపోతుందని తీర్మానాలు చేసుకున్నారు. అందుకు భిన్నంగా ఎవరూ కూడా ఊహించని రీతిలో ధరల్లో మార్పులు వచ్చాయి. మూకుమ్మడిగా జీడి వ్యాపారులు గ్రామాల్లోకి వచ్చి పోటా పోటీగా పిక్కలను కొనుగోలు చేస్తున్నారు. మంగళవారం ఉదయం ఒక గ్రామంలో జీడి పిక్కల బస్తా రూ.12వేలు కాగా సాయంత్రం సరికి రూ.13వేలుగా ఆయా గ్రామాల్లో ధర నిర్ణయించారు. పలాస మండలం మామిడిపల్లి గ్రామంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు రూ.13వేలు చొప్పున జీడి పిక్కలను కొనుగోలు చేసి తీసుకొని వెళ్లారు.


మామిడిపల్లిలో జీడి పిక్కల కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

మధ్యవర్తిత్వంతోనే భవిష్యత్‌లో కేసుల పరిష్కారం

శ్రీకాకుళం పాతబస్టాండ్: రానున్న కాలంలో ఎక్కువ కేసులు రాజీమార్గం ద్వారానే పరిష్కారమవుతాయని, దీని వల్ల డబ్బు, కాలం ఆదా అవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఐదు రోజుల పాటు జరిగే 40 మంది న్యాయవాదుల శిక్షణ కార్యక్రమం మంగళవారం కోర్టులో హాల్‌లో ప్రారంభమైంది. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ఎంపిక చేసిన న్యాయవాదులు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకుని ప్రజలకు తమ సహాయ సహకారాలు అందజేయాలని కోరారు. దేశ అత్యున్నత న్యాయస్థానం మధ్యవర్తిత్వం, సంధి ప్రాజెక్టు కమిటీ (ఎంసీపీసీ) మధ్యవర్తిత్వం భవన-సాంకేతికలపై శిక్షణ ఇస్తుందని తెలిపారు. కక్షిదారులను విడివిడిగా ఒకరి తర్వాత ఒకరిని మధ్యవర్తిత్వం చేయడం వల్ల వారికి పూర్తి సమాచారం అందజేస్తారని తెలిపారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రైవేటు బడుల్లో ఫీజులుం

- ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల పేరిట యథేచ్ఛగా దోపిడీ
- పుస్తకాల పేరుతోనూ దోచుకుంటున్న వైనం
- ఆధారాలతో సంప్రదిస్తే చర్యలు తీసుకుంటామంటున్న విద్యాశాఖాధికారులు


శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పంపిణీకి సిద్ధంగా ఉన్న పుస్తకాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రైవేటు పాఠశాలలు దోపిడీకి తెర తీశాయి. చాలా పాఠశాలలు విద్యను సేవగా అందిస్తుండగా కొందరు మాత్రం ఈ ముసుగులో సిండికేట్‌గా ఏర్పడి ఏటా ఫీజులను అమాంతం పెంచేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఫీజులు భారీగా పెంచేశారు. స్కూల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం పేరుతో సామాన్యుల నడ్డి విరుస్తున్నారు.

జిల్లాలో ఇది పరిస్థితి..

30 మండలాలతో కూడిన శ్రీకాకుళం జిల్లాలో మొత్తం ప్రైవేటు పాఠశాలలు 398 ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 79, ప్రాథమికోన్నత 136, ఉన్నత పాఠశాలలు 183 ఉన్నాయి. వీటన్నింటిలో కలిపి మొత్తం విద్యార్థులు 91,049 మంది చదువుతున్నారు. ఇందులో బాలురు 54194 మంది, బాలికలు 37755 మంది ఉన్నారు. ఈ పాఠశాలల్లో 3624 మంది టీచర్లు పాఠాలు బోధిస్తున్నారు. అలాగే జిల్లాలో ప్రైవేట్ జూనియర్ కాలేజీలు 89 ఉన్నాయి. వీటిలో 39,510 మంది వరకు చదువుతున్నారు.

రకరకాల పేర్లతో..

సూపర్ 60 అని, సీబ్యాచ్ అని, ఒలింపియాడ్ అని, ఐకాన్ అని ఇలా రకరకాల పేర్లతో ప్రైవేటు పాఠశాలలు భారీగా దండుకుంటున్నాయి. వాస్తవానికి ఈ నెల 13న పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయి. బడులు తెరుచుకోవడానికి ముందు నుంచే ఓ వైపు స్కూల్ ఫీజులు, మరోవైపు పుస్తకాల దందా కొనసాగుతోంది. ఆయా పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు యూనిఫాం కూడా తమ వద్దనే తీసుకోవాలని, స్టాక్ బయట లేదని సుస్పష్టం చేసేస్తున్నారు. స్కూళ్లలోనే కుట్టిన దుస్తులు అందజేస్తున్నారు. ఇంకొన్ని చోట్ల క్లాత్‌లు అందజేస్తున్నారు. వీటితోపాటు లైబ్రరీ, వ్యాయామం, కంప్యూటర్ వర్క్, ల్యాబ్‌వర్క్స్, కల్చరల్ యాక్టివిటీస్, స్కూల్ బస్‌చార్జీల పేరుతో ఫీజులు దండుకుంటున్నారు. పాఠ్య పుస్తకాలతో పాటు నోట్‌బుక్స్, స్టడీ మెటీరియల్స్ తప్పనిసరిగా కొనుగోలు చేయాల్సిందేనంటూ యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారు.


కోట్లలో వ్యాపారం..

ఒకటి నుంచి 5వ తరగతి వరకు ప్రైవేటు పాఠ్యాంశాలే ఉండటంతో యాజమాన్యాలు వారి ఇష్టం వచ్చిన ధరలకు పుస్తకాలు అమ్మేస్తున్నాయి. పెద్ద పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకు పాఠ్య, తరగతి నోటు పుస్తకాలకు రూ.3వేల నుంచి రూ.3500 వరకు వసూలు చేస్తున్నారు. ఇలా తరగతి పెరిగే కొద్దీ వాటి ధరలను పెంచి వ్యాపారం కొనసాగిస్తున్నారు. పదో తరగతికి చేరే సరికి రూ.12వేల వరకు పుస్తకాలకే వెచ్చిస్తున్నారు. సాధారణ ప్రైవేటు పాఠశాలల్లో ప్రీప్రైమరీ నుంచి టెన్త్ వరకు రూ.1500 నుంచి రూ.6000 వరకు వసూలు చేస్తున్నారు. విద్యాశాఖాధికారులు నామమాత్రంగా తనిఖీలు చేస్తూ వదిలేస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు.

ప్రభుత్వ బడుల్లో ఉచిత విద్య

ప్రభుత్వ బడుల్లో రూపాయి ఖర్చు లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు గత ప్రభుత్వం అనేక సంస్కరణలను తీసుకొచ్చింది. ఇంగ్లిష్ మీడియం విద్య, సిలబస్‌లో మార్పులు, తెలుగు, ఇంగ్లిష్ మీడియంలతో కూడిన బైలాంగ్విల్ పాఠ్యపుస్తకాల పుస్తకాలతోపాటు రూపాయి ఖర్చు లేకుండా స్టూడెంట్స్ కిట్స్ అందిస్తున్నారు. నాణ్యమైన రుచికరమైన పీఎం-పోషణ్ గోరుముద్ద పేరిట మధ్యాహ్న భోజనం, ఆరోగ్యానికి రాగిజావ అందిస్తున్నారు. మనబడి నాడు-నేడుతో బడుల్లో సరికొత్త సదుపాయాలు ఉన్నాయి.

తనిఖీలు చేపడతాం



ప్రైవేటు పాఠశాలల్లో చేరకముందే విద్యార్థుల తల్లిదండ్రులు వాటికి అనుమతులు ఉన్నాయో లేదో తెలుసుకోవాలి. చాలా పాఠశాలలకు అనుమతి లేదు. రెన్యువల్ కూడా లేదు. అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకుంటాం. ఫీజుల వివరాలను అన్ని స్కూళ్లలో నోటీసు బోర్డుల్లో విధిగా పేర్కొనాలి. పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపడతాం. తమకు ఆధారాలతో సహా విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే కచ్చితంగా చర్యలు చేపడతాం. యాజమాన్యాలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– కె.వెంకటేశ్వరరావు, డీఈఓ, శ్రీకాకుళం

పలాసలో భారీవర్షం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండతో ప్రజలు ఇబ్బందులు పడగా.. సాయంత్రానికి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది. సుమారు గంటన్నరకుపైగా కురిసిన వర్షానికి కేటీ రోడ్డు వరదనీటితో నిండిపోయింది. దీంతో వాహన, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.


కేటీరోడ్డులో కురుస్తున్న వర్షం

300 నాటుసారా ప్యాకెట్లతో వ్యక్తి అరెస్ట్

కంచిలి: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో మండలంలోని కత్తివరం గ్రామ కూడలి వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, అదే గ్రామానికి చెందిన మద్దిల ప్రసాద్ అనే వ్యక్తి నాటుసారా ప్యాకెట్లతో మంగళవారం పట్టుబడ్డాడు. నిందితుడు ప్రసాద్ ద్విచక్ర వాహనంపైన ప్లాస్టిక్ కవర్‌లో 300 నాటుసారా ప్యాకెట్లను తరలిస్తుండగా సీఐ జై భీమ్ తన సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. అనంతరం అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇతను రవాణాకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం గానీ, నాటుసారా గానీ అక్రమంగా తరలిస్తున్నా కఠిన చర్యలు తప్పవని సీఐ జై భీమ్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పలాస టాస్క్‌ఫోర్స్ సీఐ రామచంద్ర కుమార్, సిబ్బంది మోహనరావు, కాంతారావు, అప్పలరాజు, భాను, నాయుడు పాల్గొన్నారు.


సెబ్ అధికారులు సీజ్ చేసిన బైక్, నాటుసారా ప్యాకెట్లు

పుష్పయాగంతో ముగిసిన కల్యాణ క్రతువు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిన్నబజారులో ఉన్న దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం పుష్పయాగం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు రేజేటి వేంకట శ్రీనివాసాచార్యులు నేతృత్వంలో భూదేవి, శ్రీదేవి సమేతంగా వేంకటేశ్వరుని ఉత్సవ మూర్తులకు 12 రకాల పూలతో అలంకరణ చేసి 12 రకాల పిండివంటలు సమర్పించారు. ఉదయం స్వామికి చక్రస్నానం నిర్వహించారు. అలాగే స్వామివారి పవళింపు సేవ నిర్వహించారు. పద్మావతి శిష్య బృందంతో అన్నమాచార్య సంకీర్తన జరిగింది.


వెంకన్నకు పుష్పాలతో అలంకరణ

క్లుప్తంగా

21న మెగా జాబ్ మేళా

విజయనగరం రూరల్: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పనలో భాగంగా ఈ నెల 21న విజయనగరంలోని ఎంఆర్ కళాశాల వద్ద మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారిణి డి.అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో టైర్స్, మోడలేజ్ ఇండియా ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్, పాపులర్ షూ మార్టులలో 240 ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఎంప్లాయిమెంట్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకుని, బయోడేటా, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఒరిజనల్ ధ్రువీకరణపత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8919179415 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

సెంచూరియన్‌ను సందర్శించిన ఆస్ట్రేలియా ప్రతినిధి


రెబెక్కకు వివరిస్తున్న వీసీ ప్రశాంత కుమార్ మహంతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలిలో గల సెంచూరియన్ విశ్వ విద్యాలయాన్ని ఆస్ట్రేలియా ప్రతినిధి రెబెక్క మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీలో అమలు చేస్తున్న సేంద్రీయ వ్యవసాయం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమెకు విశ్వ విద్యాలయం వీసీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి ఇక్కడ అమలు చేస్తున్న కోర్సులు, సదుపాయాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీన్ సన్నీ డియోల్, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం బంగారం విక్రయం

• బాధితుల ఫిర్యాదు


షాపు యజమానిని నిలదీస్తున్న బాధితులు

బొబ్బిలి: పట్టణంలోని సుధా జ్యుయలర్స్ తమకు నాసిరకం బంగారం విక్రయించిందని బాడంగి మండలం గొల్లాదికి చెందిన యామలి అప్పలనాయుడు బంధువులు, బంటు సూరమ్మ ఆరోపించారు. మంగళవారం ఆ దుకాణానికి వచ్చి యజమానిని దీనిపై నిలదీశారు. అయితే తాము విక్రయించి చాలా రోజులైనందున తమకు సంబంధం లేదని షాపు యజమాని చెప్పడంతో వారు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్సై జి లోవరాజుకు ఫిర్యాదు చేశారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్


పట్టుకున్న ట్రాక్టర్లతో ఎక్సైజ్ సిబ్బంది

గజపతినగరం రూరల్: ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేశామని ఎక్సైజ్ ఎస్సై మన్మథరావు మంగళవారం తెలిపారు. దీనిపై ఆయన మాట్లాడుతూ స్థానికుల సమాచారం మేరకు మండలంలోని జిన్నాం కూడలిలో రెండు, మరుపల్లి కూడలి వద్ద ఒక ట్రాక్టర్‌ను పట్టుకుని గజపతినగరం పోలీసులకు అప్పగించి సీజ్ చేసినట్లు తెలిపారు. ట్రాక్టర్ల యజమానులను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశామన్నారు.

గూడ్స్ రైలు నుంచి విడిపోయిన బోగీలు


గూడ్స్ రైలు నుంచి విడిపోయిన బోగీలు


పార్వతీపురం టౌన్: కొమరాడ మండలం సోమినాయుడు వలస రైల్వే గేటు సమీపంలో మంగళవారం గూడ్స్ రైలు నుంచి బోగీలు విడిపోయాయి. ఈ సంఘటనపై పార్వతీపురం రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాంకేతిక కారణాల వల్ల గూడ్స్ రైలు నుంచి నాలుగు బోగీలు విడిపోగా సిబ్బంది అప్రమత్తమై మరమ్మతులు చేసి విడిపోయిన బోగీలు రైలుకు అతికించారని చెప్పారు. రైళ్ల రాకపోకలకు అంతరాయం లేకుండా చేశామని, ఎటువంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదన్నారు.

జీవిత కాల వ్యాధి

• సికిల్‌సెల్ ఎనీమియా సోకితే తీవ్ర రక్తహీనత
• సకాలంలో గుర్తించి చికిత్స చేయించుకోవాలి
• గిరిజన ప్రాంతాల్లో బాధితులు ఎక్కువ

విజయనగరం ఫోర్ట్: సికిల్ సెల్ ఎనీమియా జీవిత కాల వ్యాధి. వ్యాధి బారిన పడినవారికి రక్తం తగ్గిపోయి తీవ్ర రక్తహీనతకు గురవుతారు. సికిల్ సెల్ ఎనీమియా లక్షణాలు ఉన్న వారు వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకుని సకాలంలో చికిత్స తీసుకోవాలి. దీని వల్ల జీవితకాలం పెంచుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఈ వ్యాధి గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. మైదాన ప్రాంతాల్లో కూడా వ్యాధిగ్రస్తులు ఉన్నారు. బుధవారం ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా డే సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

సికిల్ సెల్ ఎనీమియా వారసత్వంగా వచ్చిన ఎర్ర రక్త కణాల రుగ్మతల సమూహం. వ్యాధి సోకిన వ్యక్తి రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపభూయిష్టంగా ఉంటాయి. రక్తంలోని హిమోగ్లోబిన్ శరీరంలోని వివిధ భాగాలకు ఆక్సిజన్ తీసుకువెళ్తుంది. సికిల్ సెల్ ఎనీమియా సోకిన వ్యక్తిలో ఉన్న కొడవలి కణాలు ఆక్సిజన్ తీసుకు వెళ్లే సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. సంవత్సరాల తరబడి తగినంత మొత్తంలో ఆక్సిజన్ లేక పోవడం వల్ల శరీరంలోని ఏదో ఒక అవయవం దెబ్బతింటుంది. సాధారణ రక్త కణాలతో పోలిస్తే సికిల్ సెల్ (కొడవలి కణాలు) కణాలు దృఢంగా ఉంటాయి. ఇవి రక్త ప్రవాహంలో అడ్డంకులను సృష్టిస్తాయి. సికిల్ సెల్ కణాలు తక్కువ జీవిత కాలాన్ని కల్గి ఉంటాయి. ఇది శరీరంలోని పరిమాణం తగ్గడానికి దారితీస్తుంది. తల్లిదండ్రుల నుంచి లోపభూయిష్ట జన్యువు వచ్చినప్పుడు అది సికిల్ సెల్ ఎనీమియా వ్యాధికి దారితీస్తుంది.


సికిల్ సెల్ ఎనీమియా కణాలు

వ్యాధి లక్షణాలు

- రక్త కణాల సంఖ్య తగ్గడంతో రక్తహీనత వస్తుంది.
- కళ్లు పసుపు రంగులోకి మారడం
- తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు
- శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది
- అలసట
- తరచూ వచ్చే అంటువ్యాధులు
- గర్భధారణ సమయంలో సమస్యలు
- శరీరంలో ఏదైనా అవయవం దెబ్బతినడం
- వీపు, కాళ్లు, చాతీ మొదలైన వాటిలో తీవ్రమైన నొప్పిని కల్గి ఉండడం.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- శరీరంలో తగినంత నీటిశాతం ఉండేలా చూడాలి
- వైద్యుల సలహా మేరకు మందులు వాడాలి
- సమతుల్య ఆహారం, పౌష్టికాహారం తీసుకోవాలి
- విపరీతమైన వాతావరణ పరిస్థితుల్లో ఉండకూడదు
- ఆరోగ్యకరమైన జీవన శైలిని అనుసరించాలి
- ఎత్తైన ప్రదేశాలకు వెళ్లకూడదు
- సికిల్ సెల్ ఎనీమియా పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

సికిల్ సెల్ ఎనీమియాపై అవగాహన కల్పించండి



సికిల్ సెల్ ఎనీమియా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. ప్రపంచ సికిల్ ఎనీమియా డే సందర్భంగా బుధవారం సికిల్ సెల్ ఎనీమియా గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాం. ఈవ్యాధి వ్యాప్తి, చికిత్స విధానం తదితర అంశాల గురించి కరపత్రాల ద్వారా అవగాహన కల్పించనున్నాం.

– డాక్టర్ ఎస్. భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

వ్యాధి వ్యాప్తి

సికిల్ సెల్ ఎనీమియా అంటువ్యాధి కాదు. ఒక వ్యక్తికి నీరు, గాలి, చర్మం మొదలైన వాటి ద్వారా సికిల్ సెల్ ఎనీమియా సోకదు. ఆహారపు అలవాట్ల వల్ల రాదు. జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి మాత్రమే వస్తుంది. సికిల్ సెల్ ఎనీమియా గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కాని వ్యాధి పట్ల అవగాహన అవసరం. ఈవ్యాధి గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోంది.

నీ వెంటే నేను..

• భర్త మరణం తాళలేక భార్య మృతి
• ఒకరి వెంట ఒకరి పరలోక ప్రయాణం
• కొప్పరవలసలో తీవ్రవిషాదం


బొద్దూరు శ్రీరాములు మృతదేహం

వంగర: నాతిచరామి అని దైవసాక్షిగా పెళ్లినాట చేసిన ప్రమాణానికి ఆ దంపతులు కట్టుబడ్డారు. జీవితాంతం కష్టసుఖాల్లో తోడూనీడగా మసలుకున్న ఆ పుణ్యదంపతులు చివరి మజిలీ కూడా కలిసే చేశారు. భర్త మరణాన్ని తట్టుకోలేకపోయిన ఆ భార్య కొన్ని గంటల వ్యవధిలోనే భర్త వెంటే పరలోకానికి చేరుకుంది. ఈ విషాద ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వంగర మండల పరిధి కొప్పరవలస గ్రామానికి చెందిన బొద్దూరు శ్రీరాములు(60) అనారోగ్యంతో మృతిచెందగా కొద్ది గంటల వ్యవధిలోనే ఆయన భార్య చినతల్లి(55) కూడా హఠాత్తుగా మంగళవారం మరణించింది. ఈ విషాద ఘటన గ్రామస్తులందరినీ కలిచివేసింది. గ్రామానికి చెందిన బొద్దూరు శ్రీరాములు రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీరాములు ఇటీవల విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స కోసం చేరాడు. అక్కడే చికిత్స పొందుతూ ఈ నెల 17వ తేదీన మృతిచెందాడు. ఆయన మృతదేహం సోమవారం రాత్రి గ్రామానికి తీసుకురావడంతో భార్య చినతల్లి బోరున విలపించింది. భర్త లేని విషయాన్ని జీర్ణించుకోలేకపోయి మృతదేహం వద్ద రోదిస్తూ భార్య చినతల్లి మంగళవారం వేకువజామున మృతిచెందింది. ఈ విషాద ఘటన చూసిన వారంతా దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతులకు కుమారులు రాము, రామిశెట్టితో పాటు ఒక కుమార్తె ఉన్నారు. తల్లిదండ్రులిద్దరూ ఒకేసారి మరణించడంతో కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. దంపతుల మృతదేహాలకు గ్రామసమీపంలోని శ్మశానవాటిక వద్ద ఒకేచోట చితిపేర్చి దహనం చేశారు. అంతిమయాత్రలో గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


బొద్దూరు చినతల్లి మృతదేహం


శ్రీరాములు (ఫైల్)


చినతల్లి (ఫైల్)

ట్రావెల్స్ బస్సు, బొలెరో ఢీ: ఒకరి మృతి


ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు


నుజ్జునుజ్జయిన బొలెరో వాహనం

• మరొకరికి తీవ్రగాయాలు

పూసపాటిరేగ: మండలంలోని పాతకొప్పెర్ల వద్ద జాతీయరహదారిపై మంగళవారం సాయంత్రం బొలెరో వాహనాన్ని ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పాతకొప్పెర్ల సమీపంలో జాతీయరహదారిపై టైర్‌పంక్చర్ అవడంతో ఆగి మరమ్మతులు చేసుకుంటున్న బొలెరో వాహనాన్ని పుణ్యక్షేత్రాలకు యాత్రికులతో వెళ్లి తిరిగి వస్తున్న బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో బొలెరో వాహనానికి మరమ్మతులు చేస్తున్న విశాఖ జిల్లా ఆనందపురం మండలం బొడ్డపాలెం గ్రామానికి చెందిన తోనంగి నరిసింహమూర్తి (35) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన సాడి రమణకు కాలు విరిగిపోవడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం విజయనగరం జిల్లాకేంద్రాస్పత్రికి తరలించారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లాకేంద్రాస్పత్రికి తరలించారు. ట్రావెల్స్ బస్సులో యాత్రికులు గత 36 రోజులుగా వివిధ రాష్ట్రాల్లో పుణ్యక్షేత్రాలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో కొద్ది గంటల్లో స్వగ్రామాలైన శ్రీకాకుళం జిల్లాలోని వివిధ మండలాలకు చేరుకోవాల్సి ఉండగా ప్రమాదం జరిగింది. ట్రావెల్స్ బస్సులో యాత్రికులంతా సురక్షితంగా బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన స్థలంలో పూసపాటిరేగ ఎస్సై ఎ.సన్యాసినాయుడు క్రేన్‌తో సహాయక చర్యలు చేపట్టారు. యాత్రికులను స్వగ్రామాలకు వేరే బస్సుల ద్వారా పంపించారు. ఈ ప్రమాద సంఘటనపై పూసపాటిరేగ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నర్సింహమూర్తి మృతదేహం


బస్సులో ప్రయాణించిన యాత్రికులు

ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్‌లో నీరజ ప్రతిభ

నెల్లిమర్ల రూరల్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ నెల 17 న ప్రారంభమైన అస్మిత ఖేలో ఇండియా ఉమెన్ ర్యాంకింగ్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారిణి ఖాతా తెరిచింది. నెల్లిమర్ల మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టర్ బాలి నీరజ మంగళవారం 45 కిలోల కేటగిరీలో పోటీల్లో పాల్గొని స్నాచ్ 56 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 64 కిలోలు..మొత్తం 120 కిలోల బరువు ఎత్తి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన నీరజకు రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మీ దింషా బాబు, వెంకట్రామయ్య, జిల్లా అసోషియేషన్ ప్రతినిధులు నాగలక్ష్మి, చల్లా రాము, తదితరులు అభినందనలు తెలిపారు.



రజత పతకాన్ని చూపిస్తున్న నీరజ

సికిల్ సెల్ ఎనీమియా పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: సికిల్‌సెల్ ఎనీమియాపై క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సికిల్‌సెల్ ఎనీమియా వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవగాహనసదస్సులు నిర్వహించాలని చెప్పారు. రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి లక్షణాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ కె.రాణి, డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ వెంకటేష్, చంద్రశేఖరరాజు, సత్యరాజ్, అనిల్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

• రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

విజయనగరం రూరల్: గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. మంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా జిల్లాకు వచ్చిన ఆమె విజయనగరంలోని అశోక్ బంగ్లాలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లారు. ఈ సందర్భంగా విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అలాగే గిరిజన గర్భిణుల డోలీ కష్టాలు తీర్చి, గిరిజన వసతి గృహం ఏర్పాటు చేసి వైద్య సహాయం అందేలా కృషి చేస్తానన్నారు. పౌష్టికాహారం అందిస్తామని, గిరిజన వసతి గృహాల్లో ఏఎన్‌ఎంల నియామకానికి సంబంధించి తొలి సంతకం చేశానని తెలిపారు. చట్టపరమైన చర్యలే తప్ప కక్ష సాధింపు చర్యలు ఈ ప్రభుత్వంలో ఉండవన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభం కాని ఏకలవ్య స్కూల్స్

• ఆందోళనలో గిరిజన విద్యార్థులు
• విధుల్లో చేరని ఉత్తరాది రాష్ట్రాల ఉపాధ్యాయులు
• ప్రశ్నార్థకంగా మారిన గెస్ట్ ఉపాధ్యాయుల ఉపాధి

పార్వతీపురంటౌన్: గిరిజన విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలు ఈ విద్యా సంవత్సరంలో ఇంకా తెరుచుకోలేదు. ఏటా జూన్ 12వ తేదీన తరగతులు ప్రారంభమయ్యేవి. కానీ ఈసారి స్కూళ్ల ప్రారంభ తేదీపై ఉపాధ్యాయులు సైతం తమకు ఎలాంటి సమాచారం లేదని చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ పాఠశాలలు పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా ఐదు ఉన్నాయి. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతులు నిర్వహిస్తుండగా సీబీఎస్‌ఈ సిలబస్‌తో పాటు డిజిటల్ తరగతుల వసతులున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ఏకలవ్య పాఠశాలలు ఇంకా ప్రారంభం కాకపోవడంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 2 వేల మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అలాగే 70 మంది స్థానిక గెస్ట్ ఉపాధ్యాయుల ఉపాధి కూడా ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ఉత్తరాది రాష్ట్రాల ఉపాధ్యాయులను ఇక్కడ నియమించడమే ఇందుకు కారణమని ఏకలవ్య పాఠశాలల సిబ్బంది చెబుతున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు సీబీఎస్‌ఈ సిలబస్ ఏప్రిల్ నెలలోనే ప్రారంభం కావాల్సి ఉంది. అయితే పాఠ్య పుస్తకాలు సైతం ఇప్పటికీ పంపిణీ కాలేదు.


పార్వతీపురం ఏకలవ్య మోడల్ స్కూల్

'రెగ్యులర్ రిక్రూట్‌మెంట్‌లో 'హిందీ' మెలిక

ఏకలవ్య పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయుల నియామకం కోసం గతేడాది డిసెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం పరీక్షలు నిర్వహించింది. నాలుగు సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించగా హిందీలో పాస్ మార్కులు వస్తేనే ఇతర సబ్జెక్టుల పేపర్లను కరెక్షన్ చేయాలనే నిబంధనతో తెలుగు వారికి అన్యాయం జరిగిందనే విమర్శలున్నాయి. ఈ నిబంధన వల్ల అత్యధిక సంఖ్యలో ఉత్తరాది రాష్ట్రాల అభ్యర్థులే ఎంపికయ్యారు. అలాగే గతంలో పాఠశాలల ప్రారంభ సమయంలో గెస్ట్ ఉపాధ్యాయులకు క్వాలిఫికేషన్ ఆధారంగా ఇంటర్వ్యూ నిర్వహించి.. డెమో ఇప్పించి నియమించారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో తమకు కూడా అన్యాయం జరిగిందని గెస్ట్ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లి బీచ్‌లో గల్లంతైన వ్యక్తి మృతదేహం మంగళవారం ఉదయం లభ్యమైంది. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలో పనిచేస్తున్న 8మంది స్నానానికి చింతపల్లి బీచ్‌కు రాగా వారిలో అబుల్‌కలాం మాలిక్ గల్లంతవడంతో ఫిర్యాదు మేరకు మెరైన్ పోలీసులు, లోకల్ పోలీసులు, రెవెన్యూ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు గల్లంతైన ప్రదేశం నుంచి సుమారు మూడు కిలో మీటర్ల దూరంలో అబ్దుల్ కలాం మాలిక్ మృతదేహం లభ్యమైంది. మాలిక్ స్వస్థలం పశ్చిమబెంగాల్ కావడంతో సమాచారం మేరకు బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం ఆస్పత్రికి పోలీసులు తరలించారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అబుల్‌కలాం మాలిక్ మృతదేహం

ద్విచక్రవాహనంపై ఆవుదాడి

• మహిళకు గాయాలు

రాజాం సిటీ: మండల పరిధి పెనుబాక గ్రామం వద్ద బైక్‌పై ఆవు దాడిచేసిన ఘటనలో బొద్దాం గ్రామానికి చెందిన సీహెచ్ తులసి గాయాల పాలైంది. మంగళవారం ఆమె తన కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై రాజాం వస్తోంది. పెనుబాక సమీపంలోకి వచ్చేసరికి ఆవు ఒక్కసారిగా వారిపై దాడిచేయడంతో రోడ్డుపై పడిపోయారు. ఈ ఘటనలో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. అటు వైపు వెళ్తున్న కొంతమంది స్థానికులు 108కు సమాచారం అందించగా ఈఎంటీ మీసాల ఈశ్వరరావు, పైలెట్ సాయిబాబాలు వచ్చి ప్రథమ చికిత్సచేసి మెరుగైన చికిత్సకోసం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.


గాయాలైన మహిళను 108లో తరలిస్తున్న దృశ్యం

అగ్ని ప్రమాదంలో బోటు దగ్ధం

• సురక్షితంగా బయటపడిన మత్స్యకారులు

భోగాపురం: భోగాపురం: విశాఖపట్నం జిల్లా పూడిమరక గ్రామానికి చెందిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా బోటు అగ్ని ప్రమాదానికి గురైంది. మత్స్యకారులు సముద్రంలో దూకి సురక్షితంగా ప్రాణాలతో ఒడ్డుకు చేరుకున్నారు. బాధిత మత్స్యకారులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. భోగాపురం మండలం ముక్కాం గ్రామానికి చెందిన గనగల్ల చిన్నయ్య బతుకుతెరువు కోసం 20 ఏళ్ల కిందట కుటుంబంతో కలిసి విశాఖపట్నం జిల్లా పూడిమరక వెళ్లాడు. అక్కడ సొంతంగా బోటును ఏర్పాటు చేసుకుని బంధువులతో కలిసి సముద్రంలో చేపలవేట చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం సముద్రంలోకి వెళ్లి చేపలవేట ముగించుకుని తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు బోటులో మంటల చెలరేగాయి. బోటులో ఉన్న ఏడుగురు మత్స్యకారులు సముద్రంలోకి దూకి ఈదుకుంటూ ఒడ్డుకు చేరి ప్రాణాలు కాపాడుకున్నారు. బోటు, వలలు కాలిపోవడంతో సుమారు రూ.30 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు మత్స్యశాఖ అధికారులు అంచనా వేశారు. విషయం తెలుసుకున్న గనగల్ల చిన్నయ్య బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని పరామర్శించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సాలూరు: పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్సై సీతారాం తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం, పట్టణంలోని లక్ష్మీథియేటర్, చిన్నిలాడ్జి ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో ఓ మృతదేహం ఉండడాన్ని అటువైపు బహిర్భూమికి వెళ్లిన వ్యక్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా, సంఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి పరిశీలించారు. అనంతరం దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కలెక్టరేట్ వద్ద జిందాల్ కార్మికుల ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జిందాల్ కార్మికులు

విజయనగరం అర్బన్: కొత్తవలసలోని జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ లిమిటెడ్ కంపెనీ మే 17న విధించిన అక్రమ లాకౌట్‌ను వెంటనే ఎత్తివేయాలని జిందాల్ ఎంప్లాయిస్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో విజయనగరం కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా చేశారు. జేఏసీలోని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నెక్కలి నాయుడుబాబు మాట్లాడుతూ ముందస్తు నోటీస్ ఇవ్వకుండా అర్ధంతరంగా కర్మాగారం మూసివేడం అన్యాయమన్నారు. 321 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్న ఏ కంపెనీ అయినా లాకౌట్ విధించాలంటే రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఉండాలన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా లాకౌట్ విధించడం చట్ట వ్యతిరేకమన్నారు. కర్మాగారాన్ని పునఃప్రారంభించే వరకు కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 33 రోజులకు పైగా ఆందోళన కొనసాగిస్తున్న కార్మికుల సమస్యను పరిష్కరించని యాజమాన్యంపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ కర్మాగారంలో శాశ్వత ప్రాతిపదికన 57 మంది, 264 మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కర్మాగారం తెరిపించి ఉపాధి కల్పించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల ప్రతినిధులు టి.వి. రమణ, ఎం.శ్రీనివాస్, జి.అప్పారావు, యూనియన్ నాయకులు చిన్నబాబు, బి.ఈశ్వరరావు, రాము, వైఎస్సాటీయూ నాయకులు వామాలు, ఎ.ఆర్.నాయుడు, సర్పంచ్‌లు కోన దేముడు, గణేష్, టీఎన్‌టీయూ పి.అప్పలరాజు, భీమయ్యనాయుడు, కార్మికులు పాల్గొన్నారు.